# "పార్వతీశం"!

షేక్స్పియర్ కన్న హామ్లెటు ఎక్కువ చలామణిలో ఉంటుంది. వేదంవారి కన్న చాకలి పేరిగాడికి పేరెక్కువ.

బెర్టీవూస్టర్, జీవ్స్‌ల తర్వాతే పి. జి. ఓడ్హౌస్ గుర్తుకొస్తాడు. గురుజాడ గిరీశమంత ఫేమస్ కాడు.

షెర్లాక్‌హోమ్స్‌ను గురించి తెలిసిన దానిలో సగమన్నా కానన్‌డాయ్ల్ గురించి తెలియదు.

పార్వతీశం సారీ "బారిస్టర్ పార్వతీశం" గారు మొక్కపాటి నరసింహశాస్త్రిగారి కన్నా విఖ్యాతి గాంచినవారు.

రచయితల కన్న వారి మానసపుత్రులు సుప్రసిద్ధులవుతుండడం సాహిత్య ప్రపంచంలో కొత్త కాదు. అందుకనె ఇటీవల మొక్కపాటి వారు ఢిల్లీలో మాట్లాడుతూ—

"నేను పుట్టిన నక్షత్రంకన్న నాపుస్తకం పుట్టిన నక్షత్రం మంచిది — అన్నారు.

ఈ అంశాన్నే వివరిస్తూ 'బారిస్టర్ పార్వతీశం' రచయిత ఇంకా ఇల్లా చెప్పుకున్నారు. "మా పిఠాపురంలో కనక మీరు ఏ ఎద్దు బండి వాడినీ నాపేరు చెప్పి ఇంటికి తీసుకు వెళ్ళమంటే కాస్త ఎగాదిగా చూస్తాడు. మరి మీరే గనక "కావమ్మగారి తమ్ముడింటికి తీసుకు వెళ్ళవోయ్ ...."

అంటేనా "అఁయ్" అని బయలుదేరుతాడు వాడు ఇటీవలె మా "అప్ప" గారు కాలం చేశారు కనుక నన్ను నేను ఏమని చెప్పుకోవాలో తెలీకుండా వుంది. నాపాలిటికిది దేశానికి రాష్ట్రపతి .... ఉపరాష్ట్రపతి సమస్య వంటి దనుకొండి. కనుక .... నన్ను ఫలానా...మ్మగారి మొగుడని పిలిస్తే అభ్యంతరం లేదనుకోండి . ." ! !

♦ ♦ ♦

"మొదట ఈ "పార్వతీశం" పుస్తకం అచ్చువేయించానా, అప్పుడా ప్రతుల నేమిచేయాలో ఎట్లా చేయాలో తెలియదా మరి. ఎవరన్నా చుట్టాలూ స్నేహితులూ వచ్చి, "ఏం వోయ్.... పుస్తకం రాశావుట" అని అడిగేవారు. మరి అందరికి ఇవ్వాలికాబోలు అని ఒక్కొ ప్రతి చొప్పున ఇవ్వసాగాను. వారిలో కొందరు కొంత కాలమయ్యాకవచ్చి, "ఆపుస్తకం, నువ్విచ్చావే, దాన్ని చదవకముందే మా మేనబావ (లేక మిత్రుడు లేక అప్పారావు లేక అల్లుడితమ్ముడు) వచ్చి తీసుకువెళ్ళాడోయ్ మరో కాపీ వుంటే ఇవ్వు." అని అడిగి తీసుకు వెళ్ళారు. ఈ విధంగా ఇచ్చేసరికి మొదట ఎడిషన్ కాస్తా అయిపోయింది "

"ఆ పుస్తకం అచ్చయిన క్రొత్తలో దాని తాలూకు ప్రతులను తీసుకొని రైల్లో ప్రయాణం చేస్తున్నాను. ఏలూరి వ్యాపారస్తుడొకాయన, నన్నెరిగినవాడే అదే రైలు పెట్టెలో ప్రయాణం చేస్తున్నాడు. పలకరించాడు. ఆపుస్తకాల కట్టనూ నన్నూ ఎగాదిగా చూశాడు. చివరికి వుండబట్టలేక అడిగాడు. "పంతులుగారూ ! ఏంటది "

"పుస్తకం.... నవల ! "

"మీరే రాసేసినారేటి ? " అన్నాడతడు. "నీ మొహానికి పుస్తకాలు రాయడం కూడానా" అన్నట్లుగా.

''అవును. నేనే రాశాను,'' అని ఓ కాపీ తీసిచ్చాను. "ధర ఎంతేటి." అని అడిగాడు.

"రూపాయి పావలా"

''అతడు పుస్తకంమీదకూడా అదే ధర వుండడం చూశాడు. ఇంకా రెండు గంటల ప్రయాణం వుంది కనుక కాలక్షేపానికి పనికి వస్తుందనుకున్నాడు కాబోలు రూపాయపావలాతీసి ఇచ్చాడు.

నేను ఎంతోసంతోషించాను. అతడా పుస్తకం చదువుతూ మధ్య మధ్య నవ్వుకుంటుంటె నేను మురిసిపోయాను.

ఏలూరు ఇంకో అరగంటలో వస్తుందనగా అతడాపుస్తకం పూర్తి చేసేశాడు. ఇటూ అటూ చూసి నావైపు చూశాడు.

"పంతులుగారూ మీకిది న్యాయంకాదు'' అన్నాడు.

''ఎందుకేవిటి" అన్నట్లుగా చూశాను.

''పట్టుకుని గంటసేపుకూడా పట్టలేదే .... ఇంతోటి పుస్తకానికి రూపాయి పావలాటండీ !''

''మరింతసేపూ దాన్ని చదువుతూ నవ్వుతున్నావు గదయ్యా ?"

"అవుననుకోండి !''

"మరి దాని ధరో ....''

"ఏటో .... మీరు ఇల్లా పుస్తకాన్ని తీసేసుకుని నాడబ్బులిచ్చేస్తే బాగుండును !''

ఓ నిమిషం ఆలోచించాను. అతడు వ్యాపారస్తుడు గనుక ఇట్లా చెప్పాను. "శెట్టీ! నువ్వుకొన్న పుస్తకమే నాకు బోణీ! అంచేత వెనక్కు డబ్బు అడగడం నీకు న్యాయంకాదు. ఇది చెడిందంటే నాకీ సరుకంత అమ్ముడుపోవడం కష్టమవుతుంది."

అప్పుడిహ అతగాడికి ఒప్పుకోక తప్పిందికాదు. కాని అతడు ఏలూరు వెళ్ళాక ఆ పుస్తకాన్ని రూపాయి పావలాకు అమ్మివుంటాడని నానమ్మకం.'

♦ ♦ ♦ ♦

చాల సంవత్సరాల క్రిందటి సంగతిలెండి.

అప్పుడోసారి భమిడిపాటి కామేశ్వరరావు గారికి అక్కడెక్కడో "హాస్యబ్రహ్మ" అన్న బిరుదం ఇచ్చారని పత్రికలో వార్త వచ్చింది.

దానిని చూడగానె మిత్రుడు మునిమాణిక్యం నరసింహారావు వెంటనే నాకో వుత్తరం రాశాడు. "ఇదిగో చూడబ్బాయ్, మన కామేశ్వరరావుకు "హాస్యబ్రహ్మ" అన్న బిరుదిచ్చారట వాళెవళ్ళో .... కనుక ఆలస్యం చేయడం మంచిదికాదని నేను "హాస్యవిష్ణు" అన్న బిరుదు పెట్టుకుంటున్నాను. నీకు కావాలంటే హాస్యరుద్ర అని పెట్టేసుకో —" అంటూ రాశాడు. ఈ వుత్తరం "ప్యూర్లీ ప్రైవేట్ అనుకోండి....అయినా ఇన్నేళ్ళ తర్వాత నేడీవిషయం బయటపెడుతున్నాను."

* * *

ఈవిధంగా మధుర మధురంగా, ఉల్లాసకరంగా, తమ అనుభవాలను, జ్ఞాపకాలనూ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు నెమరువేసుకుంటుంటే సుమారు రెండున్నర గంటలసేపు అన్నీమరిచి ఆనందంగా గడిపారు ఢిల్లీ తెలుగు వారిలో ఓ యాభైమంది అదృష్టవంతులు.

బదరీ యాత్రకు వెళ్ళి తిరిగివస్తూ ఢిల్లీలో కొన్నిరోజులు ఆగిన శ్రీ శాస్త్రిగారివంటి హాస్య రచయితను, అనుభవశాలినీ, సంభాషణా చతురులను, సౌజన్యమూర్తిని కని వినే భాగ్యాన్ని జూలై ఆరవ తారీఖున ఢిల్లీ "తెలుగుసాహితి' వారు కల్గించారు.

శ్రీ మొక్కపాటివారిని. వారి రచనా నైపుణిని సమావేశారంభాన శ్రీయుతులు క్రొవ్విడి లక్ష్మన్న గంటి జోగిసోమయాజి, వేమూరి ఆంజనేయ శర్మ, బాలాంత్రపు రజనీకాంతారావు, డాక్టర్ జగన్నాథం, మొసలికంటి తిరుమలరావు ప్రభృతులు కొనియాడారు. శ్రీ సంజీవయ్య శ్రీ శాస్త్రిగారిని మాలాలంకృతులు చేశారు.

నీలి ఆకాశంక్రింద, పచ్చటి గడ్డితివాసీమీద, గుబురైన చెట్లపొదల మధ్య. పక్షుల కలకలారావపు నేపథ్యంలో ఆధునిక తెలుగుసాహిత్యంలో హాస్యానికి ప్రాణంపోసిన ఒకరిద్దరు గొప్ప రచయితలలో ఒకరయిన మొక్కపాటివారిని వినగల్గడాన్ని శ్రోతలు అపూర్వభాగ్యంగా భావించారు.

♦ ♦ ♦ ♦

అయితే మొక్కపాటివారు మాటాడిందంతా కేవలం 'లైటర్‌వెయిన్" లోనేకాదు.

హాస్యంఅంటే ఏమిటి, నవ్వుఎందుకు వస్తుంది, దేనినిచూసి నవ్వుతాము. అన్నప్రశ్నలను వేసి వాటికి తగుసమాధాలను చెప్పారు శ్రీ మొక్కపాటి.

"హాస్యం నవరసాలలోకీ ప్రధానమైనది అని నా అభిప్రాయం. శృంగారం, కరుణ ఇత్యాది అన్నిరసాలనూ హాస్యం అంటిపెట్టుకుని వుంటుంది. ఇతర రసాలు మానవుడిలోని ఉద్వేగాన్ని పైకి ఉబికేటట్లు చేస్తాయి. హాస్యం వాటిని శాంతపరుస్తుంది."

['ఆగస్టు 69']